సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

పార్వతీపురంరూరల్ : సీతానగరం మండలం లచ్చయ్యపేటకు చెందిన చిల్లా రామ్‌రోషన్ ఇటీవల అనారోగ్య కారణంగా వైద్యం చేయించుకుని, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జోగారావు ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేయగా, మంజూరైన సిఎం సహాయనిధి రూ.40వేలు చెక్కును మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడికి అందించారు. .

భామిని : బాలేరుకు చెందిన గొటివాడ లక్ష్మి నారాయణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సిఎం సహాయ నిధి నుండి లక్ష రూపాయిలు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కును లక్ష్మీనారాయణ కుమారుడు ప్రవీణ్‌కు ఎమ్మెల్యే వి.కళావతి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, కాగితపల్లి కృష్ణ ఉన్నారు.

మన్యంలో మరణ మృదంగం

మృతి చెందిన అనిత

- మంత్రి ఇలాకాలో ఇద్దరు విద్యార్థులు మృతి
- ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకమేదీ?
- పౌష్టికాహారం అందిస్తే రక్తహీనత ఎందుకో?
- అంతుచిక్కని మరణాలకు అడ్డుకట్ట లేదా?
- మొద్దు నిద్రలో ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణ మృదంగం మోగుతోంది. ఈ విద్యా సంవత్సరంలో 16మంది విద్యార్థులు వివిధ అనారోగ్య కారణాల రీత్యా మృత్యువాతపడ్డారు. సాక్ష్యాత్తు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సొంత నియోజకవర్గం పరిధిలోని వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. వీరి మరణానికి ప్రధాన కారణం రక్తహీనతేనని తెలుస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నప్పుడు విద్యార్థులు రక్తహీనతతో ఎందుకు మరణిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. గత శనివారం మక్కువ మండలం ఎర్రసామంత వలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థి సీదరపు అశోక్ మృతి చెందాడు. అశోక్ కూడా రక్తహీనత కారణంగానే మరణించాడు. ఆ మరణం నుంచి తేరుకోక ముందే మంగళవారం పాచిపెంట మండలం సరాయివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పుంగారి అనిత కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. వారం రోజుల క్రితం రుతు చక్రంలో భాగంగా రక్తస్రావం జరగడంతో గురివినాయుడు పేట పిహెచ్ సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మూడు గంటలకు మృతి చెందింది. అనిత కూడా రక్తహీనత కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు చెబుతున్నారు. పాఠశాలల్లో రక్తహీనత నివారణకు చిక్కీలు, రాగి జావ పంపిణీ చేస్తున్నారు. అయినా రక్తహీనతతో మరణాలు సంభవి స్తుండడంతో గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎఎన్ఎం ల నియామకమేదీ?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమిం చాలని ఎస్ఎఫ్ఐ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తునే ఉంది. అయినా ప్రభుత్వం నుంచి ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆడపిల్ల లకు రజస్వల అవ్వగానే తల్లిదండ్రులు వివాహాలు చేస్తుంటారు. ఫలితంగా పుట్టిన పిల్లల్లో రక్తహీనత ఎక్కువగా వుంటోంది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నా అవి నాణ్యతలేనివేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో తరచూ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయడానికి వైద్య సిబ్బంది లేకపోవడం వల్లనే విద్యార్థులు అనారోగ్యానికి గురైన సరైన వైద్యం అందడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని ఎస్ఎఫ్ఐ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నారు.

తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాలి: ఎస్ఎఫ్ఐ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వరుసగా విద్యార్థుల మరణానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు అన్నారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మరణించినట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు.. విద్యార్థుల కుటుంబాలకు పది లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

పాచిపెంట : మండలంలోని కొండమోసూరుకు చెందిన విద్యార్థిని పుంగారి అనిత (14) అనారోగ్యానికి గురై విశాఖ కెజిహెచ్‌సి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాయిగుడ్డి వలస పంచాయతీ సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అనిత 9వ తరగతి చదువుతోంది. ఈనెల 14న ఈమె రజస్వలకావడంతో తల్లిదండ్రులు వారి స్వగ్రామమైన కొండమోసూరు తీసుకెళ్లారు. అయితే ఈనెల 17న అనితకు ఓవర్ బ్లీడింగ్, ఆయాసంతో బాధపడుతుందని తల్లిదండ్రులు పాఠశాల ఎఎన్ఎంకు ఫోన్ చేశారు. వెంటనే ఆమె సమీపానున్న గురువునాయుడుపేట పిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా వారు విజయనగరం గోషా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా నమయం కాకపోవడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలని

కలెక్టరేట్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు బకాయి పడ్డ కోట్లాది రూపాయలు చెల్లించ లేక, ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేక, సమస్యలు పరిష్కరించడం చేతకాక ప్రభుత్వమే వారిని సమ్మె వైపు నడిపిస్తుందని జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేసి, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం జెఎసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలున్నాయన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ నేటికీ ఏ మాత్రం ప్రగతి లేదన్నారు. గత జూలై నుండి 12వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉందన్నారు. విపరీతంగా ధరలు పెరిగిపోయాయని, కావున తక్షణమే మధ్యంతర భృతి (ఐ.ఆర్) 30% ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు తమ సొంత డబ్బును సబ్స్క్రిప్షన్‌గా కడుతూ పిఎఫ్, ఎపి జిఎల్ రుణాలు, పార్టీ ఫైనల్స్ దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి ఉద్యోగుల టిఎ, డిఎ బకాయిలతో పాటు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్నాయని, తక్షణమే రూ.25వేల కోట్లు బకాయిలను చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలో నేటికీ ఒక స్పష్టత రాలేదని అన్నారు. ఉద్యోగ నియామకాల్లో ఎన్ఎంఆర్, పార్ట్ టైం, ఫుల్ టైం ఔట్సోర్సింగ్, ఎంటిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులుగా నియామకమైన వారందర్నీ క్రమబద్ధీకరించాలని, డిపార్ట్మెంటల్ వారీగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఉమ్మడి సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించకపోతే సమ్మె అనివార్యంగా భావించి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ కో చైర్మన్లు జివిఆర్ కిషోర్, ఎస్.మురళీమోహనరావు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు వైవి సత్యనారాయణ, టి.రమేష్, డి.గణపతి, జగన్నాథనాయుడు, ఎస్.పుష్ప, వెంకట నాయుడు, జి.పద్మావతి, కె.కిషోర్, సిహెచ్ శంకర్రావు, ఎన్.నారాయణరావు, సూర్యనారాయణ, సింహాచలం, కె.విజయ్‌కుమార్, జయకుమార్, పి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

అరుకు ఎంపి బరిలో బాబూరావు నాయుడు?

ప్రజాశక్తి-పాలకొండ

అరుకు ఎస్టీ పార్లమెంట్ నియోజకవర్గానికి తెలుగుదేశం టికెట్ రేసులో విశ్రాంత ఐఎఎస్ అధికారి బాబురావునాయుడు ఉన్నారు. ఇటీవలే కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్ టిడిపి పార్టీకి రాజీనామా చేయడంతో ఎంపి అభ్యర్థిగా టిడిపి నుంచి బాబురావు నాయుడు పేరు వినిపిస్తోంది. 2014, 19 ఎన్నికల్లో అరుకు ఎంపీ సీటు వైసీపీ ఖాతాలోనే చేరింది. దీంతో ఈసారి టిడిపికి ఎలాగైనా ఈ నియోజకవర్గం ఎంపి సీటు దక్కాల్సిందేనని పార్టీ శ్రేణులు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ కేడర్‌ను కలుపుకొనే పరిస్థితి లేకపోవడంతో పాటు ఆ స్థాయిలో పరిచయాలు కూడా లేవని, దీంతో టికెట్ విషయంలో ఇంకా స్పష్టత లేదని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. అరుకు ఎంపి పరిధిలో బగతకు చెందిన తెగలు ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత కొండ దొరలు, సవరలు తదితర కులాలు ఉన్నారు. అయితే బగత కులానికి చెందిన బాబూరావునాయుడుకు టికెట్ ఇస్తే రంపచోడవరం, పాడేరు, అరుకు ప్రాంతాల్లో టిడిపికి అనుకూలంగా ఉంటుందని ఆ పార్టీలో కొందరు భావిస్తున్నారు. అలాగే రంపచోడవరం, సీతంపేట ఐటిడిఎ పిఒగా గతంలో విధులు నిర్వహించిన బాబురావు నాయుడు గిరిజనులతో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయనకు కలిసి వచ్చే విషయం. పార్వతీపురం ఐటిడె పరిధిలో కూడా ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి రాష్ట్ర వెలుగు డైరెక్టర్‌గా పని చేసిన సమయంలో అక్కడ ప్రజలకు చేరువయ్యారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పొత్తుల్లో భాగంగా బిజెపికి ఈ సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. గతంలో వైసిపి తరపున గెలిచిన కొత్తపల్లి గీత ప్రస్తుతం బిజెపిలో చేరి టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే గతంలో ఎంపిగా ఉన్న సందర్భంలో ఆమె నియోజకవర్గాన్ని కనీసం పట్టించుకోలేదనే విమర్శలతో పాటు ఆమె ఎస్టీ కాదని కూడా న్యాయస్థానంలో కేసు పెండింగులో ఉండడం ఆమెకు ప్రతికూల అంశాలుగా పరిగణిస్తున్నారు. అరుకు పార్లమెంట్ పరిధిలో బిజెపికి పూర్తి వ్యతిరేక ఓటు ఉండడం కూడా ప్రతికూల అంశమే. వైసిపి తరపున పార్లమెంట్ అభ్యర్థిగా పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఢీ కొట్టాలంటే ప్రజల్లో పేరున్న బాబురావు నాయుడు లాంటి వ్యక్తి అయితే సరిగ్గా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అయ్యన్నపాత్రుడును కలిసిన బాబూరావు నాయుడు (ఫైల్)

అయ్యన్నపాత్రుడును కలిసిన బాబూరావు నాయుడు

మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడ్ని ఇటీవల బాబూరావు నాయుడు కలిసినట్లు తెలుస్తోంది. అరుకు పార్లమెంట్ ఎంపి సీటు విషయంలో చర్చలు జరిపినట్టు తెలిసింది. అలాగే మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కూడా ఈ విషయంలో బాబూరావు నాయుడుకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

రూపాయికే రూ.12లక్షల ఆస్తి

టిడ్కో ఇళ్ల పంపిణీలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

రూ.12 లక్షల విలువైన ఆస్తిని ఒక్క రూపాయికే అప్పగించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో 980 ఇళ్లను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. తొలుత ఆయన టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో కలిసి సుమారు వంద కోట్లతో నిర్మించిన గృహ సముదాయాలను ప్రారంభించారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిన చీరలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సకల మౌలిక సదుపాయాలతో ఇళ్లు నిర్మించి అందజేసినట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 14 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. రూ.7 కోట్ల 8లక్షలతో గుమడాం సమీపంలో ఉన్న వేగావతి నది నుంచి తాగునీటి సరఫరా కోసం ప్రాజెక్టు నిర్మించామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ఒక్కో లబ్ధిదారుని రిజిస్ట్రేషన్ ఫీజు కింద 500రూపాయలు వసూలు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు రూ.2.65లక్షల రుణం కూడా 20 సంవత్సరాల పాటు చెల్లించాల్సి వుంటుందని చెప్పారు. నెలకు రూ.3వేలు చొప్పున 20 ఏళ్ల పాటు చెల్లించాలని గత ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై ఆర్థిక భారం పడకుండా కేవలం రూపాయికే రూ.12లక్షల ఆస్తిని అప్పగించాలని నిర్ణయించిందని చెప్పారు. త్వరలో ఈ ప్రాంతంలో సచివాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్ సరఫరా కోసం లబ్ధిదారులు మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రత్యేక దృష్టి సారించి సిఎంపై ఒత్తిడి చేసి రూ.7కోట్లుతో తాగునీటి సరఫరా పథకాన్ని మంజూరు చేయించారని చెప్పారు. ఎన్నికలకు ముందు గానే పేదలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అప్పగించాలని తనపై రాజన్నదొర ఒత్తిడి పెంచారని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి టిడ్కో అధికారులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, జి.నాగేశ్వరరావు, టిడ్కో ఇఇ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి, టిడ్కో డైరెక్టర్లు ఈశ్వరమ్మ, గోవింద రావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, టిడ్కో చైర్మన్



లబ్ధిదారులకు కల్యాణమస్తు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కల్యాణమస్తు నిధులు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

కల్యాణమస్తు, షాదీతోఫా నిధులను కలెక్టరు నిశాంత్ కుమార్ విడుదల చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన కల్యాణమస్తు, షాదీతోఫా అయిదో విడత నిధులు విడుదల కార్యక్రమానికి జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి కలెక్టరు, లబ్ధిదారులు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి 172 మంది నూతన వధూవరులకు మంజూరైన రూ.కోటి 12లక్షల 97వేలు చెక్కుకు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో బిసి కార్పొరేషను నుండి 124 జంటలకు రూ.62లక్షలు, కులాంతర వివాహ చేసుకున్న 4 జంటలకు రూ.3లక్షలు, ఎస్‌సి కార్పొరేషను నుండి 16 జంటలకు రూ.16లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న 8 జంటలకు రూ.9లక్షల 60వేలు, ఎస్‌టి కార్పొరేషను ద్వారా 13 జంటలకు రూ.13లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న 4 జంటలకు రూ.4లక్షల 80వేలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ద్వారా 3 దివ్యాంగులైన జంటలకు రూ.4.50లక్షలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమజేశారు. కల్యాణమస్తు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం తమకు ఎంతో అండగా ఉంటుందని, వధువు తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును ఇస్తుందని కార్యక్రమానికి హాజరైన నూతన వధూవరులైన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆస్పత్రి రోడ్డు స్థలంపై స్పష్టత ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో డిగ్రీ కళాశాల దగ్గరలో ఆసుపత్రి రోడ్డులో సర్వే నెంబర్ 20(1)(2)లో 30సెంట్లు స్థలంపై రెవెన్యూ యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని సిపిఎం నాయకులు దావాల రమణారావు అన్నారు. మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. మద్దిల చిట్టి అప్పడు అనే వ్యక్తికి వ్యవసాయ సాగు భూమి కింద పట్టా ఇచ్చారని, మళ్లీ ప్రత్యామ్నాయంగా వడమ దగ్గర భూమి ఇచ్చారని తెలిపారు. అయితే డిగ్రీ కళాశాల దగ్గరున్న భూమి కొంతమంది పట్టాలు చేయించుకుని అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ఇటీవలే ఆర్డీవో కూడా ఈ స్థలాన్ని పరిశీలించినప్పటికీ దీనిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లోగా భూమి స్వభావాన్ని బహిరంగపర్చాలని, లేకుంటే ప్రత్యక్ష కార్యచరణ చేపడతామన్నారు. ఆయన వెంట సిపిఎం నాయకులు కె.రాము ఉన్నారు.

అభివృద్ధిపై సిఎం చర్చకు రావాలి : బోనెల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విభజన తర్వాత రాష్ట్రాన్ని పాలించి అభివృద్ధి కార్యక్రమాలపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సిఎం జగన్ మోహన్‌రెడ్డి చర్చకు రావాలని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. సిద్ధం సభల ద్వారా ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని, అదే నిజమైతే రాష్ట్రానికి నేడు దాపురించిన హీనమైన పరిస్థితులు రావని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఉద్యోగాల్లేవని, డిఎస్సీ పోస్టులు, జాబ్ క్యాలెండరు లేదని, ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ జిల్లాలోనైనా రహదారులు చూస్తుంటే మరీ దారుణంగా ఉన్నాయన్నారు అంతేకాక వివిధ వర్గాలకు ఎన్నికల ముందు ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చమని రోడ్డెక్కుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అభివృద్ధి విషయంలో తమ హయాంలో జరిగిన పనులు, ఇప్పుడు జరుగుతున్న పనులపై చర్చకు రావాలని తమ అధినాయకుడు ఇచ్చిన పిలుపునకు స్పందించడం తెలియక ఉలుకు పలుకు లేకుండాపోయారని అన్నారు. రాష్ట్రానికి ఎవరు ఏం చేశారన్నది ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమైందని, జగన్మోహన్ రెడ్డి చెప్పే మాయమాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదని అన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, పోల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు మంగళవారం తమ విధులకు హాజరు కాకుండా యాక్ట్ నెంబర్ 27 రద్దు చేయాలని నినాదాన్ని చేస్తూ కోర్టులో జరిగే వ్యవహారాలకు హాజరు కాలేమని, ఈనెల 23 వరకు విధులకు బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా తమ విధులను బహిష్కరిస్తున్నట్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముమ్మాటికీ మంచిది కాదని, స్టేట్ బార్ కౌన్సిల్ వారు మున్సిఫ్ కోర్టులను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాల్సి ఉందని అన్నారు. భూ వ్యవహారాలకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ వ్యవస్థ లోప భూయిష్టమైన విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతుల ధర్నాకు మద్దతుగా నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

రైతుల ధర్నాకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు స్థానిక రైతులు పూర్తి స్థాయిలో మద్దతు తెలపాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మధుసూదనరావు, శివున్నాయుడు కోరారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు మద్దతుగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొమరాడలో నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఈరోజు ఢిల్లీ సరిహద్దుల్లోని వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సోమనాథ్ సిఫార్సు మేరకు అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా అన్ని సంఘాలు మద్దతు పలుకుతూ భవిష్యత్తులో పెద్ద ఎత్తున రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామ సమీపాన ఉద్యాన కళాశాలలో స్ట్రాంగ్ రూములను మంగళ వారం పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, రమణ పరిశీలించారు. జిల్లాలోని పలు నియోజకవర్గాలకు సంబంధించి ఉద్యాన కళాశాలలో ఓట్లు లెక్కింపు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేయనున్నట్టు ఆర్‌డిఒలు పేర్కొన్నారు. ఈ మేరకు ముందస్తుగా స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ నిర్వహణతో పాటు వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో డివిజనల్ సర్వే అధికారి కరణం సూర్యారావు, డిటిలు పెళ్లూరి సత్యలక్ష్మీకుమార్, తూముల వెంకటరమణ, మండల సర్వేయర్లు ఉన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పరిశ్రమల స్థాపన, స్వయం ఉపాధి పొందాలనుకొనే వారిని ప్రోత్సహించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాఖలవారీగా పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో యూనిట్ల స్థాపనకు వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను సమీక్షించారు. సింగిల్ డెస్క్ విధానంలో వచ్చిన 26 దరఖాస్తుల్లో 19 మంజూరవ్వగా, మిగిలిన 7 దరఖాస్తులను గడువులోపల వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి. గయాజుద్దీన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జనసేన కార్యకర్తలు

భక్తులతో పోలమాంబ ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి ఆలయాలు ఐదో వారం భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలు భక్తులకు వాటర్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు వి.సుగుణేశ్వరరావు, జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నియమావళి పాటించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయులు నియమావళిని పాటించాలని ఎంఇఒ-1 డి.గౌరు నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఎజెండా నిర్వహణ తప్పనిసరిగా పాటించాలని, పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్నం భోజన పరిశీలన, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేలా కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిని ఎ-గ్రేడులోకి వచ్చేలా బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సోంబర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వలగెడ్డ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంఇఒ డి.సూర్యచంద్రరావు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌కు కావాల్సిన వసతులైన విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి వసతులు ఉన్నవీ, లేనవీ తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానం చకచక చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు, హెచ్ఎం ప్రసాదు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కె.ఇచ్ఛాపురంలో జనసేన-గిరిసేన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

కె.ఇచ్ఛాపురంలో జనసేన - గిరిసేన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కె.ఇచ్ఛాపురంలో మంగళవారం జనసేన- గిరిసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జనసేన నాయకులు బిపి నాయుడు మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గానికి ఒక బలమైన గిరిజన నేత నిమ్మల నిబ్రం సమన్వయకర్తగా నియమించారన్నారు. జనసేన బలోపేతానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని, క్రియాశీలక సభ్యత్వం పెట్టి ప్రతి ఒక్కరికీ అండగా ఉంటున్నామని ప్రజలకు తెలిపారు. జనసేన నాయకులు ఎం.పుండరీకం మాట్లాడుతూ వైసిపి నాయకులు అడ్డదారులు తొక్కుతూ ప్రజలకు రక్షణ లేకుండా చేస్తూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లు లేకుండా చేసి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. జనసేన జానీ మాట్లాడుతూ దగా డిఎస్‌సి పెట్టి నిరుద్యోగులతో ఆటలాడుతున్నారని, నాలుగున్నరేళ్లలో ఉద్యోగాలు తీయకుండా జాబ్ క్యాలెండర్ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసగించారన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాల జారీలో జాప్యం వద్దు

ప్రజాశక్తి -భామిని

పిల్లలకు వివిధ అవసరాల నిమిత్తం ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే, ఫిజికల్ డాకుమెంట్ల పరిశీలన పేరుతో జాప్యం వద్దు అని ఎమ్మెల్యే వి.కళావతి తహశీల్దార్ శ్రీనివాసరావుకు సూచించారు. స్థానిక విఆర్ఒ, ఆర్ఐలు ఫిజికల్ డాకుమెంట్లు పూర్తి స్థాయిలో పరిశీలించాక మీ లాగిన్‌కు ఫార్వర్డ్ చేస్తే, జారీలో జాప్యం ఉండదని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సంప్రదిస్తే క్షేత్ర స్థాయిలో ప్రజలకు సేవలు చేయడం సులభతరం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జె సి ఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ వున్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వి.కళావతి పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి నిధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆస్పత్రి భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట సచివాలయాన్ని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే సమస్యలను అక్కడే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పైడ్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

వైసిపి పాలనలో రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ విలువలు నానాటికి దిగజారిపోతున్నాయని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో పత్రికా విలేకరిపై జరిగిన భౌతిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ, రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాలని మంగళవారం కొత్తవలసలో జరిగిన ఒక కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి వారికి రాజ్యాంగ సంస్థలైన కోర్టులు, పోలీసులు, పత్రికా విలేకరులు ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు అంటే లెక్కలేనితనాన్ని ప్రదర్శన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగడితే భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. వీరి ప్రవర్తనను ఐదేళ్లుగా గమనిస్తున్న ప్రజలు రాబోతున్న రెండు నెలల్లో సరైన తీర్పు ఇచ్చి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి.రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, కోలా సరితా మధు, బడే గౌరినాయుడు, నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం

అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై జరిగిన దాడి అన్యాయమని కురుపాం ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు నెల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కురుపాం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు ఎన్నికల ఉప తహశీల్దార్ జి.చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధులు, బాధ్యతలు నిర్వహిస్తున్న విలేకరిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కె.మౌళి, జి.ఢిల్లీశ్వరరావు, ఎస్.వరప్రసాద్, పి.సంతు, వి.శేషు, ఎస్.సోమేశ్, పి.నాగరాజు, బి.అనిల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి ప్రభుత్వంలో శాంతి భద్రతల కరువయ్యాయి : టిడిపి

వైసిపి ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, పాత్రికేయులకు పూర్తిగా శాంత భద్రతల కరవయ్యావని టిడిపి అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి ఎన్.కృష్ణబాబు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిగా శాంతి భద్రతల కరువై సామాన్యులపై దాడులు పెరిగాయని, మొన్నటికి మొన్న రాప్తాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి చాలా దారుణమని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు కలిశెట్టి శ్రీనివాసరావు, బోటు గౌరి, కొట్టు రవణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటికీ అందని 'ఆడుదాం ఆంధ్ర' ప్రోత్సాహకం

ప్రజాశక్తి - కురుపాం

సిఎం జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా ఆటల్లో గెలుపొందిన క్రీడాకారులకు పోత్సాహంగా అందించాల్సిన నగదు నేటికీ జమ కాలేదని కురుపాంలో పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురుపాం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో మొదటిస్థానంలో గెలుపొందిన పి.లేవిడి సచివాలయం జట్టు క్రీడాకారులు 16 మందికి జమ చేయాల్సిన రూ.35 వేలు నగదు ఇంకా పడలేదన్నారు. ఇదే జట్టు జిల్లాలో నిర్వహించిన పోటీల్లో కూడా మూడో స్థానంలో నిలిచారు. క్రికెట్‌తో పాటు మహిళల వాలీబాల్ రెండోస్థానం వచ్చిన జట్టు సభ్యులకు, జిల్లాలో మహిళల కబడ్డీ మూడో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు సైతం నగదు జమకాలేదని తెలిపారు. దీనిపై నిర్వాహకుల దృష్టిలో పెట్టినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ ప్రాంతంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేసి ఆదివాసీలకు న్యాయవాది చదువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవకాశం కల్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతంలో సామాన్యులకు న్యాయం జరగని పరిస్థితి ఈ రోజుకీ ఉందన్నారు. అలాగే ఆదివాసీలకు ప్రత్యేకించి ప్రతి ఐటిడిఎ పరిధిలో ఒక ప్రభుత్వ లాయర్‌ను నియమించినట్లయితే కొన్ని ఆదివాసీ చట్టాలపై అవగాహన కల్పించడానికి, అలాగే ఆదివాసీల కేసులను కూడా వాదించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ సలహా మండలి సమావేశాలు న్యాయమూర్తులతో ఏజెన్సీ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే యువతీ యువకులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని, కావున న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, విద్యాకమిటీ ఛైర్మన్, వార్డు సభ్యుడు

భాషా వాలంటీర్లను కొనసాగించాలి

విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

భాషా వాలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్ఎ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన వాలంటీర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డుసభ్యులు విద్యార్థులు మొగధారగూడ జిపిఎస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ ఛైర్మన్ సవర డొంబు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్‌లోనూ తమ పిల్లలకు ఆదివాసీ స్థానిక సవర భాషా ద్వారానే విద్యా బోధన కొనసాగాలన్నారు. స్థానిక భాషలకు రక్షణ కల్పించాలని, ప్రతి ఏటా జూన్ నుంచి ఏప్రిల్ వరకూ విద్యాబోధన జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. వీరి నిరసనకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పకీర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు సవర శ్రీను, సవర బంగారు, సవర గయారమ్మ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. కార్యదర్శిగా కొత్తకోట పార్వతీదేవితో పాటు 12 మంది నాయకులు ఎన్నికయ్యారు. అనంతరం శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రాజెక్టు కార్యదర్శి పార్వతీదేవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్ బలోపేతానికి బడ్జెట్ కేటాయింపులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఐసిడిఎస్ బలోపేతానికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్‌గా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు ఎస్.బంగారమ్మ, బేగం, ఎన్.జయలక్ష్మి, ఎం.రమణమ్మ, లక్ష్మి, సాయి, పూజ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వాలంటీర్లు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా ఉంటూ లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ పథకాలను అందజేస్తున్న వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదుగురు వాలంటీర్లకు సేవా రత్న, 270 మంది వాలంటీర్లకు సేవా మిత్రగా గుర్తించి వారికి సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించి మంచి గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమల్లో క్షేత్రస్థాయిలో నిస్వార్థముగా సేవలందిస్తూ వాలంటీర్లు ప్రజా మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, రవీంద్ర, మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, నాయకులు టి.గౌరీశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భామిని : ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలు చెంతకు చేర్చిన మీ సేవలు మరువ లేనివని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి వాలంటీర్లను కొనియాడారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్లకు అవార్డులు అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



వాలంటీరును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి

కనీస వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు : ఎపిడి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు కనీసవేతనం తగ్గకుండా సాంకేతిక సహాయకులు కొలతలు ఇచ్చి పనులు చేయించాలని ఎపిడి జి.శ్రీహరి రావు అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎపిఒ గౌరీనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారు లకు సంబంధించిన మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఎపిడి మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న వేతన దారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటయ్యేలా ఉపాధి హామీ అధికారులు ముందుగా కొలతలిచ్చిన అనంతరం పనులు చేయించాలని సూచించారు. వేతనదారులకు విధిగా వేతనం గిట్టుబాటయ్యేలా ఉపాధి హామీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనుల్లో అధిక సంఖ్యలో వేతనదార్లు పాల్గొనేలా చర్యలు చేపట్టాల్సి ఉందని ఈ సందర్భంగా క్షేత్ర సహాయకులకు దిశ నిర్దేశం చేశారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర్లలో అటెండెన్స్ వేయాల్సి ఉందన్నారు. అలాగే పనులు జరిగిన వెంటనే బిల్లులను అప్లోడ్ చేయాల్సి ఉందని, తద్వారా సకాలంలో వేతనాలు చెల్లింపులకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో సాంకేతిక సహాయకులు ఎం.హరికృష్ణ, క్షేత్ర సహా యకులు తదితరులు మామిడి రాధ ఉన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాన్ని జరిపించేందుకు, తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి ఏటా మాగశుద్ధ ఏకాదశి పర్వదినం రోజున ఆలయ ప్రాంగణంలో ఈ కల్యాణ మహోత్సవం దేవస్థానం అధికారులు నిర్వహిస్తున్నారు. ఉదయం సుప్రభాత సేవ ఆరాధన,మంగళశాసనములు, విశేష హోమములు, శాత్తుమురై, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి, భాగ్యలక్ష్మి అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ఎస్ వి ఎల్ ఎన్ శర్మ యాజి సంపూర్ణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వి వి అప్పలాచార్యులు, వి వి శశి ధర్ , ఫణిధర్, పీసపాటి గౌతమ్, మణిహారం శేషాచార్యులు, తదితరుల సహకారంతో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపే తంగా నిర్వహించినట్టు దేవస్థానం ఇఒ వివి సూర్యనారాయణ, ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ మంత్రాపు సత్యనారాయణ తెలిపారు.



వెంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అభివృద్ధి పనులు వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణం లోని బెలగాంలో గల చర్చి వీధి జంక్షన్ కూడలి నుండి బుడా నిధులతో జరుగుతున్న సిసి ప్రధాన రహదారి, కాలువ నిర్మాణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి పి.కనకారావు, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి గల చర్చి వీధిలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా చూడాలని సూచించారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ సింహాచలం

డిఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎపి ఎస్సీ ఎస్టీ టీచర్ ఫెడరేషన్ నాయకులు డిఇఒ పగడాలమ్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల సానుకూలంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎ.వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్, అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శు ఎసూరి నారాయణ, ఎ.ప్రకాష్ బాబు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

రాయగడ జమ్ములో జెఎఎస్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడ జమ్మూ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయగడ జమ్మూ చుట్టుపక్కల గ్రామాల నుంచి గిరిజన ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. వైద్యుల సలహాలు సూచనలను తీసుకున్నారు. తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం. బుద్దేశ్వరరావు, గిరిజనులకు సేవలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని చిదిమిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలి ఆరోగ్యంగా ఉండాలి అనే సంకల్పంతో గ్రామంలో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి డి.ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, వైద్య , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గుమ్మిడి గూడ, కటారికోట గిరిశిఖర గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ" కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గుమ్మిడిగూడ పంచాయితీ నుంచి కొంతమంది గిరిజన కుటుంబాలు మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక యువత మాట్లాడుతూ కరెంట్ బిల్లులు, గ్యాస్ రెట్లు, నిత్యావసర వస్తువుల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, రోజు కూలీ చేసుకొనే తాము ఎలా బతకాలో తెలియడం లేదని చెప్పుకున్నారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ టిడిపి గెలిచిన వెంటనే నిత్యావసరాల వస్తువులు అందరికీ అందుబాటు ధరల్లో ఉంటాయన్నారు. లబ్ధిదారులందరికీ అన్ని పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముఖి సూర్యనారాయణ, కొత్తల పోలినాయుడు, కె.సురేష్, దండి మోహనరావు, ఇ.తిరుపతిరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర ఘట్టం : మీ భవిష్యత్తు మా బాధ్యతని టిడిపి నియోజకవర్గ బాధ్యులు నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ఎం.రాజపురంలో ఏర్పాటుచేసిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడారు . టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒక్కరికి సంక్షేమం పథకాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మక రవణమ్మ, రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, ఆరుకు పార్లమెంటరీ బీసీ కన్వీనర్ పి కృష్ణమూర్తి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగా, వీరఘట్టం పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, కార్యకర్తల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుమ్మడిగూడలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న నాయకులు

6 వాహనాలు వేలం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో నాటు సారా అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను వేలం వేశారు. రూరల్ ఎస్సై దినకర్‌తో పాటు ఎస్ఇబి అధికారులు పాల్గొన్నారు. ఈ వేలంపాటలో ఆరు ద్విచక్ర వాహనాలకు వేలం వేయగా రూ.13915 కు పాడుకొన్నారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వివిధ సందర్భాల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ పి.నరసింహ మూర్తి తెలిపారు. ఈ వేలంలో 8 వాహనాలు ఉంచామని, ఆసక్తి గలవారు ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆధార్ కార్డుతో సహా హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

నాటు బండిని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - కొమరాడ

నాటు బండిని లారీ ఢీకొన్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం వేకువ జామున పార్వతీపురం నుంచి కల్లికోటకు ఇసుక తరలింపు కోసం నాటు బండిపై వస్తున్న వ్యక్తిని లారీ బలంగా ఢీకొట్టింది. కొమరాడ ఎస్సై నీలకంఠ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణపల్లికి చెందిన నగిరెడ్డి సింహాచలం ఇసుక కోసం నాటు బండిపై వస్తుండగా వెనుక నుంచి లారీ బలంగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఎద్దుకు గాయాలయ్యాయి. అలాగే నాటు బండిపై ఉన్న సింహాచలంకు తీవ్ర గాయాలవ్వడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో విద్యుత్ పరికరాలు చోరీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రెండో వార్డులో గల ఎన్‌పి అగ్రహారంలో ఉన్న కొత్తవీధిలోని త్రినాథ స్వామి దేవస్థానంలో దొంగలు చొరబడ్డారు. ఆలయంలోని విద్యుత్ పరికరాలైన ఎంపిల్ ఫైర్ 1 మౌత్, 3 బాకాలు అపహరించుకుని పోయారు. వీటి విలువ రూ.25 వేలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు పద్మనాభ మహాపాత్రో తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సంతోష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.